

డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

డిగ్రీ ప్రవేశాల విషయంలో తాత్సారం చేసి వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 8లో ▸



పనిచేయని లిఫ్టులు

ఆర్జీయూకేటీలోని అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా రెండు నెలలుగా లిఫ్టులు పనిచేయకపోవడంతో బోధనా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸



వైభవంగా పవిత్రారోహణ

ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహ స్వామి దివ్య పవిత్రోత్సవాల్లో బుధవారం పవిత్రారోహణ వేడుక కన్నులపండువగా జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

పంట కాలువ ప్రక్షాళన



ఉండిలో పాములపర్రు పంట కాలువ ప్రక్షాళన చేసిన అధికారులు

సాక్షి స్పందన

ఉండి: ఈ నెల 19వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఇదేనా పంటకాలువల ప్రక్షాళన అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఉండి పాములపర్రు పంటకాలువలో చెత్త, తూడును తొలగించి కాలువను ప్రక్షాళన చేశారు. దీంతో పాములపర్రు గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గీత కులాలకు బార్లు

భీమవరం: జిల్లాలో గీత కార్మికులకు కేటాయించాల్సిన బార్లను ప్రకటించామని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగ ప్రభుకుమార్ తెలిపారు. భీమవరం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీల్లో శెట్టిబలిజ సామాజిక వర్గానికి, పాలకొల్లులో గౌడ సామాజిక వర్గానికి కేటాయించామని చెప్పారు.


అదనపు పోలింగ్ స్టేషన్లను గుర్తించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): గత సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ సమయం ఓటింగ్ కొనసాగిన పోలింగ్ స్టేషన్లను గుర్తించి, అవసరమైన చోట అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణ, అదనపు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని పోలింగ్ స్టేషన్లలో ఎక్కువ సమయం పోలింగ్ నిర్వహించాల్సి వచ్చిందని, ఇలాంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ ఎక్కువ సమయం జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఎక్కువ సమయం పట్టడానికి గల కారణాలను విశ్లేషించడంతోపాటు, అవసరమైన చోట అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఉండి: శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యుత్ వినియోగదారుల సమస్యకు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బొక్కా సత్యనారాయణ పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చని ఏఈ తెలిపారు.

ముంపులో కనకాయలంక కాజ్‌వే



కనకాయలంక కాజ్‌వే మీద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

యలమంచిలి: వరుసగా రెండో రోజు కూడా కనకాయలంక కాజ్‌వే వరద నీటిలో మునిగింది. ధవళేశ్వరం వద్ద బుధవారం సాయంత్రం 8.08 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు వదలడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద ప్రభావానికి గురైన కనకాయలంకలో తహసీల్దార్ నాగ వెంకట పవన్‌కుమార్, ఇతర అధికారులు పర్యటించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భద్రాచలం వద్ద నీటిమట్టం గురువారం 48 అడుగులకు చేరుకునే అవకాశం ఉందన్నారు. వరద పెరిగితే కనకాయలంక కాజ్‌వేతోపాటు పెదలంక కాజ్‌వే కూడా వరద నీటిలో చిక్కుకునే అవకాశం ఉందన్నారు. వరద పెరిగే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో లంక గ్రామాలలో ప్రత్యేక అధికారులను నియమించి వారి పర్యవేక్షణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, మంచంపై చికిత్స పొందుతున్న రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): కృష్ణ జిల్లా మచిలీపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖాధికారి ఎస్.ఎస్.కృపావరం ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ తరలింపు?

- పీ–4 పేరిట ఉండిలో ఏర్పాటుకు యత్నాలు
- జిల్లా కేంద్రం నుంచి తరలిపోతుందని జోరుగా ప్రచారం
- కలెక్టరేట్ భవనానికి భీమవరం ఏఎంసీలో స్థలాన్ని కేటాయించిన గత ప్రభుత్వం
- రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి అప్పట్లోనే టెండర్లు
- గత ప్రభుత్వానికి పేరొస్తుందని కూటమి నేతల కుట్రలు



భీమవరంలోని కలెక్టరేట్ భవనం

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రం నుంచి కలెక్టరేట్ తరలిపోనుందా? పీ–4 పేరిట ఉండి నియోజకవర్గంలో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? భీమవరానికి తలమానికంగా ఉన్న కలెక్టరేట్‌ను తరలించుకుపోతుంటే పట్టణానికి చెందిన కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు చూస్తూ ఊరుకుంటారా? ఈ విషయంలో వారి వైఖరి ఏ విధంగా ఉండబోతుంది? జిల్లాలోని రాజకీయ, సామాన్య వర్గాల్లో ఇప్పుడిదే హాట్ టాపిక్. పరిపాలన సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. నరసాపురం పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాలతో భీమవరం కేంద్రంగా 2022 ఏప్రిల్ 4న నూతన పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడింది. కలెక్టరేట్‌ను తాత్కాలికంగా స్థానిక 7వ వార్డులోని ప్రైవేట్ కళాశాల భవనంలో ఏర్పాటుచేశారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా శాశ్వత ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం భీమవరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) యార్డులో 20 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసింది. ఈ భూమిని మార్కెటింగ్ శాఖ నుంచి రెవెన్యూ శాఖకు భూమిని బదలాయిస్తూ 2023 మార్చి 20న జీవోను జారీచేశారు. ఈ మేరకు రెవెన్యూ రికార్డులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు చేసి రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.



భీమవరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ

ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవు

పెదఅమిరంలో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం ఉంది. ఈ పంచాయతీకి జువ్వలపాలెం రోడ్డు మీదుగా వెళ్లాలి. ఈ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుంది. సాధారణ రోజుల్లోనే డా.బీఆర్ అంబేడ్కర్ సెంటర్ నుంచి ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వరకు 3.5 కి.మీ ప్రయాణానికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. కలెక్టరేట్‌తో వాహనాల రద్దీ మరింత పెరిగి సమస్య అధికమవుతుందంటున్నారు. భీమవరంలోని ఏఎంసీకి పాలకొల్లు, ఆచంట, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల నుంచి రోడ్డు సదుపాయం ఉంది. ఆయా నియోజకవర్గాల వారు భీమవరం పట్టణంలోకి రావాల్సిన పనిలేకుండా నేరుగా కలెక్టరేట్‌కు చేరుకునే వీలుంటుంది. దీనివలన పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు కొంత మేర తగ్గుతాయని స్థానికులు అంటున్నారు.

గత ప్రభుత్వానికి పేరొస్తుందని..

భీమవరంలో శాశ్వత భవన నిర్మాణం జరిగితే గత ప్రభుత్వానికి పేరొస్తుందనే రాజకీయ కక్షతో కూటమి నేతలు కుట్ర రాజకీయాలకు తెరలేపారన్న విమర్శలున్నాయి. ఏఎంసీలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోను ఆరు నెలల క్రితమే కూటమి ప్రభుత్వం రద్దుచేస్తూ ఉత్తర్వులిచ్చింది. భవన నిర్మాణం కోసం ఉండి నియోజకవర్గం పెదఅమిరంలోని 3.5 ఎకరాల స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలన చేశారు. జిల్లా కేంద్రం మార్పుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అప్పట్లో సోషల్ మీడియాలో దుమారమే రేగింది. కలెక్టరేట్ తరలింపు ప్రయత్నాలను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ, ఇతర రాజకీయ పక్షాలు స్పందించాయి.

మళ్లీ తెరపైకి.. తాజాగా మళ్లీ కలెక్టరేట్‌ను తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు ముమ్మరమైనట్టు రాజకీయ వర్గాలు, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. పీ–4 పేరిట ఉండి నియోజకవర్గంలో కలెక్టరేట్ నిర్మాణానికి అనుమతులివ్వాలని కూటమి నేత ఒకరు సీఎం చంద్రబాబును కలిసినట్టుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై భీమవరానికి చెందిన కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఇంకా స్పందించిన దాఖలాలు లేవు. ఈ విషయంలో వారి స్టాండ్ ఏమిటన్న చర్చ నడుస్తోంది. భీమవరంలోని ఏఎంసీ స్థలం అందరికీ అందుబాటులో ఉంటుందని, ప్రజామోదం లేకుండా కలెక్టరేట్ తరలిస్తే ఉద్యమిస్తామని సీపీఎం నేతలు ప్రకటించారు. నూతన భవనం ఎక్కడ నిర్మించేది ప్రజాప్రతినిధులు, అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరి ప్రయోజనాల కోసం కలెక్టరేట్ తరలింపు సరికాదంటున్నారు.

దళితుల జోలికొస్తే సహించేది లేదు



వాండ్రంలో నిరసన తెలుపుతున్న దళితులు

ఉండి: వాండ్రం దళితపేట డ్రెయిన్‌కు ఆనుకుని ఉన్న ఇళ్లు పడగొట్టాలంటూ స్థానికంగా వున్న కొందరు ఓ భారీ పొక్లెయినర్‌ను తీసుకురావడంతో ఒక్కసారిగా దళితులు భగ్గుమన్నారు. గ్రామంలోని దళితులు బుధవారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రైతుల ముసుగులో అధికారులను అడ్డుపెట్టుకుని కూటమి నాయకుల సహకారంతో మా ఇళ్ళను పడగొట్టేందుకు కక్ష కట్టారని ఆరోపించారు. గ్రామంలో అధికారులు చెబుతున్న డ్రెయిన్ ప్రభుత్వ లెక్కల్లో లేదన్నారు. కొందరు వ్యక్తుల కోసం డ్రెయిన్‌ను అడ్డుపెట్టుకుని అక్కడ రోడ్డు వేయాలని చూస్తున్నారన్నారు. కొందరు స్థానిక ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం ఇచ్చి కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. ఇక నుంచి ప్రతీరోజు ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. వాండ్రం గ్రామంలో దళితులకు చెందిన ఇళ్ళు కూల్చేస్తామని కొందరు అధికారులను కూడా మోసం చేస్తున్నారని దళిత మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. రూపాయి రూపాయి కూడగట్టుకుని కట్టుకున్న మా ఇళ్లను మా ప్రాణాలు ఇచ్చయినా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తి రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ యాడంగి యేసు, కోనాల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వినాయక చవితి ఉత్సవాలు



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిషేధించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో వినాయక చవిత ఉత్సావాలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో ఫైర్, విద్యుత్, పోలీస్, మున్సిపల్ తదితర అధికారులు ఒకే వేదికలో కూర్చునేలా ఏర్పాటుకు పర్మిషన్లు త్వరితగతిన ఇచ్చేలా చూడాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు రెండు మూడు రోజుల ముందే అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, కౌసర్ భానో పాల్గొన్నారు.

కాళీపట్నం భూముల సర్వేపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామకంఠం భూములు సర్వేపై జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం నరసాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి, మొగల్తూరు మండల తహసీల్దార్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళీపట్నం గ్రామ ఎస్టేట్ భూములకు సంబంధించి గ్రామ కంఠం పరిధిలో పాత రికార్డు ప్రకారం ఎలా ఉన్నది, ప్రస్తుత భూ పరిస్థితి సర్వే చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. రెవెన్యూ గ్రామమైన కాళీపట్నం పరిధిలో ఉన్న జగన్నాథపురం, కోమటి తిప్ప గ్రామాలలో సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ రాజ్‌కిషోర్ పాల్గొన్నారు.

టీడీపీలో 'నామినేటెడ్' ముసలం

- భీమవరంలో గౌడ, శెట్టిబలిజ నేతల అసంతృప్తి
- దేవస్థానం, సొసైటీ, ఏఎంసీ, నీటి సంఘాల్లో ప్రాధాన్యత ఇవ్వలేదని ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న టీడీపీ గౌడ, శెట్టిబలిజ సామాజికవర్గ నేతలు

సాక్షి, భీమవరం: భీమవరంలో టీడీపీలో నామినేటెడ్ ముసలం రాజుకుంది. నామినేటెడ్ పదవుల్లో ఒక సామాజిక వర్గానికి కొమ్ముకాస్తూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి తమను అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని నియోజకవర్గంలోని ఆ పార్టీకి చెందిన గౌడ, శెట్టిబలిజ సంఘం నేతలు మండిపడుతున్నారు. తమ పట్ల వివక్ష చూపుతున్న నాయకత్వంపై తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. టీడీపీ భీమవరం నియోజకవర్గ గౌడ, శెట్టిబలిజ సంఘ సమావేశం బుధవారం స్థానిక సర్దార్ గౌతు లచ్చన్న కమ్యూనిటీ హాలులో జరిగింది. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరవల్లి చంద్రశేఖర్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక కమిటీ డైరెక్టర్ బొక్కా సూర్యనారాయణ, గౌడ సాధికారిక డైరెక్టర్ జంపన ధనరాజు, జిల్లా సాధికారిక కమిటీ కార్యదర్శి వీరమల్లు శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నేత కడలి మృత్యుంజయుడు తదితరులు మాట్లాడారు. బీసీల్లో అత్యధిక జనాభాగా ఉన్నా గౌడ, శెట్టిబలిజ సామాజిక వర్గాలకు దేవస్థానం బోర్డు, సొసైటీలు, నీటిసంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ నామినేటెడ్ నియామకాల్లో ఎక్కడా ప్రాధాన్యత కల్పించకుండా తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు బీసీల పార్టీకి చెబుతూ పదవులు మాత్రం ఇతర సామాజిక వర్గాల వారికి పంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఇప్పటికే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతారామలక్ష్మి వద్ద తమ అసంతృప్తిని వెళ్లగక్కినా ఫలితం లేదన్నారు. కూటమి పేరు చెప్పి తమను బుజ్జగిస్తున్నారు తప్ప న్యాయం చేయడం లేదన్నారు. బిస్కెట్ పడేస్తే సరిపోతుందన్న ధోరణిలో స్థానిక నాయకత్వం తీరుందని వారు మండిపడ్డారు. పార్టీ కోసం శ్రమిస్తే తమ పట్ల వివక్ష చూపుతూ గుర్తింపులేకుండా చేస్తున్నారన్నారు. తమ సామాజికవర్గాల పట్ల చిన్నచూపు చూస్తున్న నాయకత్వంపై తాడోపేడో తేల్చుకునే సమయం ఆసన్నమైందని, సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. మరోమారు సమావేశం ఏర్పాటుచేసుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు.

గోదావరి ఉగ్రరూపం

- వేలేరుపాడు మండలంలో 26 గ్రామాలకు రాకపోకలు బంద్
- పునరావాస శిబిరాలకు వరద బాధితులు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ
- భద్రాచలం వద్ద 53 అడుగులకు నీటిమట్టం చేరవచ్చని అంచనా
- అప్రమత్తమైన యంత్రాంగం.. కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- పోలవరం స్పిల్‌వే నుంచి 10 లక్షల క్యూసెక్కులు విడుదల



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ప్రవహిస్తున్న గోదావరి వరద

పోలవరం రూరల్/వేలేరుపాడు/కుక్కునూరు: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇంద్రావతి, ప్రాణహితలు పొంగి ప్రవహిస్తుండటం, దీనికి శబరి తోడు కావడంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 10 గంటలకు నీటి మట్టం 48 అడుగులు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పలుచోట్ల బాధితులను పడవలపై పునరావాస కేంద్రాలకు తరలించారు.

పోలవరం వద్ద 32.20 మీటర్లకు నీటి మట్టం

గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 32.20 మీటర్లకు నీటి మట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి సుమారు 10 లక్షలకు క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు చేరుతోంది.



ఎద్దుల వాగు వద్ద పడవ దాటుతున్న ప్రజలు



నీటమునిగిన వేలేరుపాడు-రుద్రంకోట రహదారి

నీట మునిగిన వంతెనలు : వరద ప్రభావం వల్ల వేలేరుపాడు మండలంలో మేళ్ల వాగు, ఎద్దెల వాగు, టేకురు వాగు, పెద్దవాగు, వంతెనలు నీట మునిగాయి. దీంతో మండలంలో 26 గ్రామాలకు రాకపోకల స్తంభించాయి. వేలేరుపాడు నుంచి రుద్రమకోట, రేపాక గొమ్ము, కన్నాయగుట్ట, తిర్లాపురం, పాత నార్లవరం వెళ్లే రహదారులు నీట మునిగాయి. అధికారులు మొత్తం మూడు నాటు పడవలు, రెండు లాంచీలు ఏర్పాటు చేశారు. ఎద్దుల వాగు వద్ద నాటు పడవపై ప్రజలు దాటుతున్నారు. ఇంతవరకు 393 కుటుంబాలను కుక్కునూరు మండలంలోని రాయకుంట పునరావాస కాలనీ, తాడువాయిలోని చల్లవారిగూడెం కాలనీలకు తరలించారు

వరద ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన : వేలేరుపాడు మండలంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన రేపాక గొమ్ము గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. పశువులను ముందస్తుగా గ్రామం నుంచి తరలించుకోవాలని తెలిపారు. అనంతరం వేలేరుపాడు రుద్రంకోట గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నీట మునిగిన రహదారి : వరద ఉధృతితో కుక్కునూరు గ్రామ శివారులోని జామాయిల్ తోటలు నీటమునిగాయి. వింజరం పంచాయతీలోని ఎర్రబోరు–ముత్యాలంపాడు గ్రామాల మధ్య రహదారి వరద నీటితో నిండిపోయింది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ముంపు ప్రాంతాల ప్రజలు అధికారులతో సహకరించి వరద సహాయ కేంద్రాలకు తరలి రావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ అధికారులతో కలిసి బుధవారం ముంపు గ్రామాలైన కట్కూరు, ఎర్రతోలు, బోళ్లపల్లి,, చిత్తంరెడ్డిపాలెం తదితర గ్రామాలలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యడపల్లి గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తీసుకొచ్చేందుకు బోట్లను పంపించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దవాగు, ఎద్దువాగుల నుంచి కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వరద ముంపు పొంచి ఉన్నందున, ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు టార్పాలిన్లు అందించామన్నారు. జిల్లాకు ఇప్పటికే 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయని చెప్పారు. ముంపు ప్రాంతాల్లోని గర్భిణులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. వరద సహాయక చర్యలపై కలెక్టరేట్‌లో 1800 233 1077, 94910 41419 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని, జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్‌లో, కుక్కునూరు, వేలేరుపాడులలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. రవాణా సౌకర్యాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కూలిన చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై వరద పరిస్థితిని కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణ, డీఆర్డిఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు ఉన్నారు.

కోమటిలంకకు రాకపోకలు బంద్

దెందులూరు: కొల్లేరులో ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కోమటిలంకలో 1500 మంది నివసిస్తున్నారు. బయటినుంచి కోమటిలంక గ్రామానికి వెళ్లే కల్వర్టు వరద నీటికి మునగిపోయింది. పడవలోనే విద్యార్థులు, ఉద్యోగులు నిత్యవసరాలకు వెళ్లేవారు ప్రయాణిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరుకు కూతవేటు దూరంలో ఉన్న కోమటిలంకను ఇప్పటికీ ఒక్క అధికారి తొంగి చూడలేదు.

యంత్రాంగం సన్నద్ధం

ఏలూరు(మెట్రో): జిల్లాలో వరద పరిస్థితిని బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరద ఉధృతిపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగంతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. కలెక్టరేట్‌తో పాటు వేలేరుపాడులో 83286 96546, కుక్కునూరు 80962 74662 నెంబర్లతో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అందించేందుకు మూడు నెలల రేషన్‌ను ఉంచామన్నారు. 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటరు పామాయిల్, కేజీ పంచదారతో పాటు ఉల్లిపాయలు, బంగాళాదుంపలు బాధిత కుటుంబాలకు అందించేందుకు అందుబాటులో ఉంచామన్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



సోనియా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శుభశేఖర్

ఆగిరిపల్లి: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిన్న ఆగిరిపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న ఆగిరిపల్లికి చెందిన చెందిన రాముకు కృష్ణాజిల్లా కూచిపూడికి చెందిన వెంకట సోనియాకు (28) ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొద్ది రోజులుగా రాముకు, సోనియాకు మధ్య మనస్పర్థలతో గొడవలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం సోనియా పుట్టింటికి వెళ్లి వెంటనే తిరిగి రాలేదని భర్త ఆమెతో మాట్లాడటం లేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం అర్ధరాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోనియా తండ్రి వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



అభిషేక్ మృతదేహం

దెందులూరు: ప్రమాదవశాత్తూ చెరువులో జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. కొవ్వలి వీఆర్ఓ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కొవ్వలి గ్రామానికి చెందిన కానూరి రామయ్య కుమారుడు అభిషేక్ డిగ్రీ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం అభిషేక్ అతని స్నేహితుడు ఇంకేటి రాహుల్‌తో కలిసి బహిర్భూమికని కుంటల చెరువు కు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తూ అభిషేక్ కాలుజారి చెరువులో పడిపోయాడు. అతడ్ని రక్షించేందుకు రాహుల్ ప్రయత్నించి చెరువులో పడిపోవడంతో అతడ్ని స్థానికులు రక్షించారు. ఈ ఘటనలో అభిషేక్ చెరువులో మునిగి మృతి చెందాడు.

వివాహిత బలవన్మరణం



విజయ మృతదేహం

పోలవరం రూరల్ : మనస్తాపంతో ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన పోలవరంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకపోతున్నామని, ఇక్కడ వ్యాపార లావాదేవీలు ఏవీ లేవని, రాజమండ్రి వెళ్లిపోదామని కిలపర్తి విజయ (40) భర్త శేఖర్‌తో ఇటీవల వాగ్వివాదం చేసింది. అనంతరం మనస్థాపానికి గురైన విజయ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు ఈశ్వర్ సాయిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీపై కేసు నమోదు

భీమడోలు: భీమడోలులోని గుర్రాల చెర్వు గట్టు వద్ద ఓ ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దూబ లక్ష్మణరావు, నీలవేణి దంపతులు ఈనెల 19వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. బీరువాలోని ఆరు కాసుల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదును అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

- నాలుగు నెలల తరువాత ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల
- సిలబస్ పూర్తికాకుండానే పరీక్షలు ఎదుర్కోవాలని విద్యార్థుల ఆందోళన



ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల విషయంలో తాత్సారం చేసి వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాలపై సరైన నిర్ణయం తీసుకులేకపోవడంతో విద్యార్థులు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొన్నారు. విద్యా సంవత్సరం ఆలస్యంగా ప్రారంభమైతే సిలబస్ పూర్తి కాకుండానే పరీక్షలను ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం ఉంటుందని, ఆ ప్రభావం డిగ్రీ మూడు సంవత్సరాలు పూర్తయ్యేవరకూ ఉంటుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు వెలువడిన నెలలోపే డిగ్రీ ప్రవేశాలకు ప్రభుత్వాలు చర్యలు తీసుకునేవి. అయితే కూటమి ప్రభుత్వం యువత భవితపై, విద్యారంగంపై చిన్నచూపుతో, ఇంజనీరింగ్, తదితర డిగ్రీ తత్సమాన కోర్సులను నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలలకు మేలు చేకూర్చే విధానాలు అనుసరించి డిగ్రీ ప్రవేశాలను ఆలస్యం చేసింది.

నాలుగు నెలల తరువాత షెడ్యూల్ విడుదల

2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను ప్రభుత్వం గత ఏప్రిల్ 12వ తేదీన విడుదల చేసింది. ఆ ఫలితాల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి ఆ పరీక్షల ఫలితాలను కూడా జూన్ 7వ తేదీన విడుదల చేసేసింది. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలై నాలుగు నెలలు దాటిపోగా, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలై కూడా 75 రోజులు దాటిపోయింది. గతేడాది కూడా ప్రభుత్వం ఇలానే డిగ్రీ ప్రవేశాలను ఇంటర్ ఫలితాలు విడుదలైన రెండున్నర నెలల తరువాత చేపట్టగా అప్పట్లో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటైనందున విధానాలు రూపొందించడంలో ఆలస్యమై ఉంటుందని సరిపెట్టుకున్నారు. అయితే ఈ ఏడాది కూడా డిగ్రీ ప్రవేశాలను మరింత ఆలస్యంగా అంటే నాలుగు నెలల తరువాత చేపట్టడం కూటమి ప్రభుత్వం వైఫల్యమని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు.

ప్రవేశాల షెడ్యూల్ ఇలా..

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ సోషల్ వర్క్, ఆనర్స్ వంటి కోర్సుల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ, అటానమస్, ప్రైవేటు ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, ప్రైవేట్ అటానమస్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. 25 నుంచి 28వ తేదీ వరకూ కళాశాలల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు, 29వ తేదీన వెబ్ ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం కల్పించింది. ఈనెల 31న తుది సీట్ల కేటాయింపు పూర్తిచేయనుంది. సీట్లు పొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో 91 డిగ్రీ కళాశాలలు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 91 డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 7 ప్రభుత్వ, 1 ప్రభుత్వ ఎయిడెడ్ అటానమస్, ఒక ప్రైవేట్ అటానమస్, 31 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు మొత్తం కలిపి 40 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో 4 ప్రభుత్వ, 2 ప్రభుత్వ అటానమస్, 4 ఎయిడెడ్ అటానమస్, ఒక ప్రైవేట్ అటానమస్ కళాశాలలున్నాయి. అలాగే ఒక ప్రైవేట్ ఎయిడెడ్, 39 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు మొత్తం కలిపి 51 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం వివిధ గ్రూపులకు సంబంధించిన సుమారు 60 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

మాజీ మంత్రి వనిత కుటుంబంలో విషాదం



మాజీ మంత్రి తానేటి వనితను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ మంత్రి తానేటి వనిత మావయ్య తానేటి బాబూరావు (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం పాలకొల్లు తీసుకువచ్చారు. కొంతకాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన పెద్ద కుమారుడు డాక్టర్ టి.శ్రీనివాస్‌కు చెందిన తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. బుధవారం పాలకొల్లులో అంతిమ కార్యక్రమాలు జరిపారు. ఈయనకు భార్య జ్యోతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత పెద్ద కోడలు. బాబూరావు మృతిపై వైఎస్సార్ సీపీ నాయకులు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, యడ్ల తాతాజీ, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు.

పనిచేయని లిఫ్టులు.. ఉద్యోగుల పాట్లు

నూజివీడు ట్రిపుల్ ఐటీ సిబ్బంది క్వార్టర్స్‌లో నెలకొన్న దుస్థితి



నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండు నెలలుగా పనిచేయని పీ1 క్వార్టర్ లిఫ్ట

నూజివీడు: ఆర్జీయూకేటీలోని అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా బోధనా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా లిఫ్టులు పనిచేయకపోయినా వాటిని బాగుచేయించాలన్న ఆలోచన కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫ్యాకల్టీకి, ఇతర సిబ్బందికి, అధికారులు క్యాంపస్‌లో ఉండేందుకు బహుళ అంతస్థుల క్వార్టర్స్ ఉన్నాయి. ఐదు అంతస్థులుగా ఉన్న ఈ క్వార్టర్స్‌కు లిఫ్టులు పనిచేయకపోవడంతో అందులో ఉండే సుమారు 1,500 కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి.

పనిచేయని లిఫ్టులు

ట్రిపుల్ ఐటీలో బ్యాంకు పక్కనే ఉన్న పీ1 క్వార్టర్స్ లిఫ్ట్ రెండు నెలలుగా పనిచేయడం లేదు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. అలాగే ఎస్1, ఎస్3, ఎం1 క్వార్టర్స్ లిఫ్టులు నెల రోజుల నుంచి పనిచేయడం లేదు. ఎస్1 క్వార్టర్స్ లిఫ్ట్ డోర్ నాలుగైదు నిమషాలకు పడుతుండటంతో అంతసేపు వేచి ఉండలేక ఫ్యాకల్టీ కుటుంబాలు మెట్లనే ఆశ్రయిస్తున్నారు.

సరుకులు తెచ్చుకోవాలంటే నరకం

మంచినీటి టిన్నులు, బియ్యం బస్తాలు, ఇతర బరువుతో కూడిన బస్తాలు రెండో అంతస్థు దగ్గర నుంచి ఐదో అంతస్థు వరకు తీసుకెళ్లాలంటే ఆయా అంతస్థుల్లో ఉన్న కుటుంబాలు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు. 20 లీటర్ల టిన్నులు మోయలేక ఐదు లీటర్ల టిన్నులు కొనుక్కుంటున్నామని అంటున్నారు. కొందరు అధ్యాపకులు నాలుగైదుసార్లు ఎక్కి దిగలేక క్యాంపస్‌లోనే ఉంటూ మధ్యాహ్న భోజనం క్యారేజీని తీసుకెళ్తున్నారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో పాలు పోసేవారు ఫ్లాట్ వద్దకు రావడం లేదని దీంతో కిందకు వెళ్లి పాలు తెచ్చుకుంటున్నామని అంటున్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగుల పాట్లు వర్ణనాతీతం.

పని భారంతో అవస్థలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేధిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది కొరత



ఆసుపత్రిని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భీమవరం (ప్రకాశం చౌక్) : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరత వేధిస్తోంది. దీంతో పనిచేస్తున్న కార్మికులపై పని భారం పెరిగి అవస్థలు పడుతున్నారు. 8 గంటలు చేయాల్సిన డ్యూటీని 12 నుంచి 15 గంటలపాటు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క సక్రమంగా అందని జీతాలు, మరో పక్క పనిభారం, అధికారుల వేధింపులతో పారిశుద్ధ్య కార్మికులు విసుగెత్తిపోతున్నారు.

సగం మంది సిబ్బందితోనే కాలక్షేపం

జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నర్సాపురం 100 పడకల ఆస్పత్రుల స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో 20 మంది పారిశుద్ధ్య సిబ్బందికిగాను కేవలం 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్న పరిస్థితి. అలాగే జిల్లా ఆస్పత్రి తణుకులో 40 మంది కార్మికులకుగాను కేవలం 20 మంది కార్మికులతో నెట్టుకొచ్చేస్తున్నారు. అలాగే సీహెచ్‌సీలుగా ఉన్న పెనుగొండ, ఆచంట, ఆకివీడు ఆస్పత్రుల్లో 10 మంది చొప్పున సిబ్బందికిగాను కేవలం ఒకొక్క ఆస్పత్రిలో ఆరుగురితో పనిచేయిస్తున్నారు. రోగుల సంఖ్య పెరుగుతున్నా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో వారు పనిభారంతో ఘొల్లుమంటున్నారు.

ఫినాయిల్, చెత్త కవర్లూ కొరతే

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫినాయిల్,, చెత్త వేసుకునే కవర్లు ఇతర మెటీరియల్ కొరత ఉంది. 100 పడకల స్థాయిలో ఉన్న ఆస్పత్రికి సైతం కేవలం 50 పడకల ఆస్పత్రికి సరిపోయే మెటీరియల్‌ను మాత్రమే సరఫరా చేస్తున్నారు. దాంతో ఆస్పత్రులు శుభ్రంగా ఉండడం లేదు. భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు కొన్నిసార్లు తమ సొంత ఖర్చుతో ఫినాయిల్ కొనుగోలు చేసి ఆస్పత్రిని శుభ్రం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సక్రమంగా అందని జీతాలు, పీఎఫ్ సౌకర్యం నిల్

పనిభారం పెరిగినా కష్టపడి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కాంట్రాక్టర్ సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. నాలుగు నెలలకు ఒకసారి జీతాలు ఇవ్వడం, ఒక నెల పెండింగ్ పెట్టడంతో బతుకు బండి నడిపేందుకు కార్మికులు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇక జీతాల నుంచి పీఎఫ్ మినహాయింపు సైతం చేయడం లేదు. తమ కుటుంబాల కోసం ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పని చేస్తున్న తమపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచి తమకు పని భారం తగ్గించాలని, అలాగే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్ సమస్య పరిష్కరించాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

పని భారం ఎక్కువగా ఉంది



నేను భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నాను. పనికి తగిన విధంగా సరిపడా కార్మికులు లేక ఉన్నవారిపై పని భారం పడుతుంది. కార్మికుల సంఖ్య పెంచి పని భారాన్ని తగ్గించాలి. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

– బి. వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు

కార్మికుల కష్టాలు పట్టించుకోవాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య కార్మికులు తక్కువగా ఉండడం వల్ల పని గంటలు పెరుగుతున్నాయి. సాధారణంగా 8 గంటలు పని ఉండగా 12 నుంచి 15 గంటల వరకు చేయాల్సి వస్తోంది. కార్మికుల కష్టాలు పట్టించుకోవాలి.

– ఎం.మంగ, పారిశుద్ధ్య కార్మికురాలు

పీఎఫ్ సమస్య పరిష్కరించాలి



పారిశుద్ధ్య కార్మికులకు పని భారం పెరిగి తీవ్ర ఒత్తిడితో పనిచేస్తున్నాం. కార్మికుల సంఖ్య పెంచి పీఎఫ్ సమస్య పరిష్కరించాలి. ఆస్పత్రుల్లో మగ కార్మికులను పెంచి ఆడ కార్మికులకు పని భారం తగ్గిచాలి.

– ఎం.సుధారాణి, పారిశుద్ధ్య కార్మికురాలు

రుణం కోసం ఫోర్జరీ సంతకం

- డిపో మేనేజర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కండక్టర్
- విచారణకు ఆదేశించిన అధికారులు

నూజివీడు: నూజివీడు డిపో మేనేజర్‌గా ఇటీవల వరకు పనిచేసి విజయవాడకు బదిలీ అయిన సీహెచ్ సూర్య పవన్‌కుమార్ సంతకాన్ని డిపోలో పనిచేసే కండక్టర్ ఒకరు ఫోర్జరీ చేసిన విషయం వెలుగు చూసింది. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.12 లక్షల రుణం పొందేందుకు కండక్టర్ ఫోర్జరీకి పాల్పడినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీకి లోను కావాలని సదరు కండక్టర్ దరఖాస్తు చేసుకోగా వారు నూజివీడు డిపోలో పనిచేస్తున్నట్లుగా యూనిట్ మేనేజర్‌తో సర్టిఫికెట్ కావాలని అడిగారు. దీంతో ఆ కండక్టర్ డిపో మేనేజర్ బదిలీ అయ్యే ముందు అడగగా ఆయన సంతకం పెట్టలేదు. దీంతో డిపోమేనేజర్ బదిలీ అయిన తరువాత ఆయన సంతకాన్ని కండక్టర్ ఫోర్జరీ చేసి సర్టిఫికెట్‌ను ఫైనాన్స్ కంపెనీకి అందజేశారు. తదుపరి ఫైనాన్స్ కంపెనీ అధికారులు సర్టిఫికెట్ కరెక్టేనా, ఆ కండక్టర్ నూజివీడు డిపోలోనే పనిచేస్తున్నారా అని ఎంక్వైరీకి పంపారు. దీంతో స్థానికంగా ఉన్న అధికారులు పరిశీలించగా సంతకం డిపో మేనేజర్‌ది కాదని తేలింది. అయినప్పటికీ విజయవాడలో పనిచేస్తున్న డిపో మేనేజర్‌కు ఆ సర్టిఫికెట్‌ను పంపగా ఆయన కూడా తనది కాదని చెప్పి ఏలూరులోని డీపీటీఓ షేక్ షబ్నంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫోర్జరీకి పాల్పడిన కండక్టర్‌కు విధులు అప్పగించొద్దని స్థానిక డిపో అధికారులకు తెలిపి విచారణకు ఆదేశించారు.

కో-ఆపరేటివ్ బ్యాంకుల సేవలు విస్తృతం చేయాలి



తణుకులో ఏలూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా కోఆపరేటివ్ బ్యాంకుల సేవలు మరింత విస్తృతం చేయాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు తణుకు శాఖను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోఆపరేటివ్ బ్యాంకులు మెరుగైన సేవలు అందిస్తున్నాయని, పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించేందుకు సహకరించాలని కోరారు. ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ బ్రాంచి ప్రారంభోత్సవం పురస్కరించుకుని మూడురోజులపాటు అన్ని డిపాజిట్లపైనా ప్రత్యేక అదనపు వడ్డీ ఆఫర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ముక్కామల మహా పీఠాధిపతులు శ్రీధర్ స్వామీజీ, ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల బాబు, వాణి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, రాజమండ్రి ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు, కొవ్వూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సీఈవో ఎం.అచ్యుతరావు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తే చర్యలు

ఏలూరు టౌన్: ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ప్రారంభం మొదలుకానున్న తరుణంలో డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఉద్యోగాల పేరుతో మోసం చేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ నియామక పరీక్షల ఫలితాలు విడుదల కావటంతో అభ్యర్థులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు, ఇతర మోసగాళ్లు రంగంలోకి దిగారనీ, వారి మాయమాటలను ఎవరూ నమ్మి మోసపోవద్దని డీఎస్పీ కోరారు. కొందరు నేరగాళ్లు అభ్యర్థులకు ఫోన్ చేసి మార్కుల్లో మార్పులు చేసి మీకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తామంటూ నమ్మించి, భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ప్రచారం సాగుతుందనీ., ఈ నేపథ్యంలో డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అటువంటి వారి మాటలను నమ్మవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ నియామక ఎంపికలో ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు కల్పిస్తారని స్పష్టం చేశారు. ఎవరైనా ఫోన్ చేస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. అభ్యర్థులు మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

సుందరగిరిలో వైభవంగా పవిత్రారోహణ



బంగారు శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న పండితులు



స్వామివారి మూలవిరాట్‌పై పవిత్రాలను ఉంచి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ కనకవల్లి సమేత లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవరోజు బుధవారం పవిత్రారోహణ వేడుక కన్నుల పండువగా జరిగింది. ముందుగా అర్చకులు, పండితులు ఆలయ యాగశాలలో ఉదయం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ మండప పూజలు, నిత్య హోమాలు, బలిహరణ, మూలవరులకు, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అలంకరణలు జరిపారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను బంగారు శేష వాహనంపై ఉంచి పూజలు నిర్వహించి అనంతరం దివ్య పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులపై దివ్య పవిత్రాలను వేసి పవిత్రారోహణ వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం మండప పూజలు, నిత్య హోమములు, మూలమంత్ర హోమములు, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ సూచనలు, ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి పర్యవేక్షణలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం జరిగే పవిత్రావరోహణతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

ఆపరేషన్ ట్రేస్‌లో బంధువుల చెంతకు బాలుడు



బాలుడు, అతని మేనత్తతో ఏలూరు మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు

ఏలూరు టౌన్: ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా ఒక బాలుడ్ని బంధువులకు అప్పగించినట్లు ఏలూరు మహిళా స్టేషన్ సీఐ, శక్తి టీమ్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో జిల్లాలో ఈనెల 1 నుంచీ 31తేదీ వరకూ ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమంలో బాలల తల్లిదండ్రులు, బంధువులను గుర్తించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఏలూరులోని చిల్డ్రన్ హోమ్‌లో గత 8 ఏళ్లుగా ఉంటున్న నాగరాజు అనే బాలుడి బంధువులను గుర్తించామన్నారు. బాలుడి మేనత్త బుధవారం ఏలూరు నగరంలోని చిల్డ్రన్ హోమ్‌కు చేరుకుని బాలుడ్ని గుర్తించి సంతోషాన్ని వ్యక్తం చేసింది. చదువు పూర్తి చేసిన అనంతరం ఆమెతో పంపేందుకు అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో శక్తిటీమ్ కానిస్టేబుల్ సుజాత, కానిస్టేబుల్ గోపాలకృష్ణ, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది ఉన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆకివీడు: అధనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో నివసిస్తున్న సత్యవేణికి హైదరాబాద్‌కు చెందిన కన్నా నరేష్‌తో 2023లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అదనపు కట్నం కోసం భర్త నరేష్, అత్తమామలు, ఆడపడుచు, చిన్నమామలు వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

ముంపు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్షాలకు మునిగిపోయిన వరిచేల రైతులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం పెంటపాడు మండలం యానాలపల్లి గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను రైతు సంఘం ఆధ్వర్యంలో పర్యటించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు మాట్లాడారు. సార్వా సీజన్ నుంచి రైతులు ఇబ్బందులు, ఖర్చులు, పెట్టుబడులు తదితర విషయాలపై మాట్లాడారు. సాగు కాలువలను, మురుగు కాలువలను ఆధునీకీకరించాలని, రబీ సీజన్‌కు విత్తనాలు, ఎరువులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దానయ్య, సుబ్బయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ సర్వీస్ సహకారంతో దీక్షా డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో వీకర్స్‌కాలనీ నాన్న కళ్యాణ మండపంలో డ్వాక్రా మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం వలన కలిగే నష్టాలు, అరికట్టే విధానాలను తెలిపారు. సొసైటీ సైకాలజిస్ట్ గంగాధర్ మాట్లాడుతూ మద్యం తీసుకోవడం వలన ఇంట్లో శాంతి, ఆరోగ్యం కోల్పోతారని తెలిపారు. స్టాఫ్ పి.నాగలక్ష్మి, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎస్సై, మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ శాంతి కోరుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్, సంస్థ పట్టణ అధ్యక్షుడు జినపనేని రాజేంద్రకుమార్, పైడికొండల సింధు, యెగ్గిన శరత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, మానవత విలువలు పెంచేందుకు ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. సెక్రటరీ మిరియాల కిశోర్, కోశాధికారి ఎర్ర ఆంజనేయులు, జంగా రామ్‌రాయ్, చేకూరి బంగార్రాజు, బురిడి సతీష్, పాందురంగారావు, పి.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఇరగవరంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ఇరగవరం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయాధికారులు, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు బృందం ఇరగవరం, అర్జునుడుపాలెం, కావలిపురం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక వర్షాలకు నీట మునిగిన పొలాలు కాపాడేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. నీటి ముంపునకు గురైన పిలక దశలో ఉన్న వరి పొలాల్లో నీటిని బయటకు తరలించి ఎకరాకు 20 కేజీల యూరియా, 10 నుంచి 15 కేజీల పొటాష్ చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వై.రాఘవేంద్ర, డాక్టర్, కృషి విజ్ఞాన కేంద్రం ఉండి వారు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటల వరకూ ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, మొగల్తూరు ప్రాంతాల ప్రయాణికులు 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

సమస్యల వలయంలో కడకట్ల

- స్పందించని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



వార్డులో గుర్రపుడెక్కతో మాలగుంట చెరువు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కడకట్ల 31వ వార్డులో ఎన్నో సంవత్సరాలుగా పలు సమస్యలు వేధిస్తున్నాయి. సెకండ్ ఫ్లెటైవర్ బ్రిడ్జి నుంచి హెచ్‌పీ గ్యాస్‌కు వెళ్లే మార్గం, వార్డులో పలు అంతర్గత ప్రాంతాల్లో అపారిశుద్ధ్య పరిస్థితులు నెలకొన్నాయి. వార్డు కొన్ని ప్రాంతాల్లో అంతర్గత రహదారులు మట్టి రోడ్లు, కంకర రోడ్లు ఉన్నాయి. వర్షకాలంలో రోడ్లపై వర్షపు నీరు నిలవడం, బురదమయంగా మారుతున్నాయి. కొన్ని రోడ్ల మీద చెత్తాచెదారాలు, వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, తూడుతో దర్శనం ఇస్తున్నాయి. సీసీ రోడ్లు నిర్మించాలని వార్డు స్థానికులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

వార్డుల్లో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేదు, అక్కడ అక్కడా సీసీ డ్రెయినేజీ వ్యవస్థ కానవస్తుంది. సీసీ డ్రెయినేజీల్లో నాణ్యత లేకపోవడంతో డ్రెయిన్ గోడలు విరిగి డ్రెయిన్లలోనే పడి ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. మురుగు పల్లపు ప్రాంతాల్లోకి ప్రవహించకపోవడంతో ఎక్కడ చూసినా అస్తవ్యస్త పరిస్థితులు, దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొన్ని చోట్ల డ్రెయిన్లకు కల్వర్టులు లేవు. డ్రెయినేజీలను పరిశుభ్రం చేయాలని, అవసరమైన చోట్ల పల్లపు ప్రాంతాలకు మురుగు నీరు సాగే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థలోని మురుగు నీరు కొన్ని చోట్ల మాలగుంట చెరువుల్లోకి చేరుతున్నాయి. అక్కడక్కడా ఉన్న కచ్చా డ్రెయిన్లను శుభ్రం చేసేందుకు, చెత్తాచెదారాలను లిఫ్ట్ చేసేందుకు పారిశుద్ధ్య పని వారు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

అనేక ప్రాంతాలలో ఖాళీ స్థలాలు కానవస్తున్నాయి. కొన్ని రహదారులు ఖాళీ స్థలాలతో సమాంతరంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు, మురుగునీరు, వాడకం నీరు ఖాళీ స్థలాల్లోని పల్లాలకు చేరుతున్నాయి. రోడ్లు బాగా ఎత్తులోనూ, ఖాళీ స్థలాలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. ఖాళీ స్థలాలు చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. తుప్పలు, తూడు, వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారాయి. పందులు, పాముల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురికి కూపాలుగా మారడంతో వేసవిలో కూడా దోమల ఉత్పత్తి కేంద్రాలుగానే అవి ఉన్నాయి. వర్షాకాలం వస్తే వార్డులో దుర్భర పరిస్థితులు కనబడుతున్నాయి. వార్డులో ఉన్న చెరువులు అపరిశుభ్రంగానూ, దుర్వాసనతోనూ, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉండటంతో ఆయా ప్రాంతాల స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. వార్డులో చాలా చోట్ల వీధి దీపాలు లేవు. ఉన్నా వెలగడం లేదని పలువురు చెబుతున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి



కడకట్ల 31వ వార్డులో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిఉంది. ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి. వర్షపు నీటినిల్వలు లేకుండా చూడాలి. దోమలు నివారించేందుకు చర్యలుచేపట్టాలి. చెరువులను ప్రక్షాళన చేయాలి. అధికారులు తక్షణమే స్పందించి వార్డు సమస్యలను పరిష్కరించాలి.

– ఎంవీకే స్వామి, తాడేపల్లిగూడెం



మురుగునీటితో అస్తవ్యస్తంగా రహదారి మార్గం



పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం



చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ

నేటి నుంచి యోగాసన పోటీలు



రాష్ట్ర వ్యాప్తంగా హాజరవుతున్న యోగా సాధకులు, గురువులు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి నిర్వహణలో ఏపీ రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలు పలు విభాగాల్లో ఆగస్టు 21 నుంచి 24 వరకు పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయం ఎడ్యుకేషన్ సొసైటీలో నిర్వహిస్తున్నారు. ఈ ఛాంపియన్ షిప్ పోటీలకు బుధవారం ప్రత్తిపాడుకు 470 మంది యోగా సాధకులు, 70 మంది యోగా న్యాయ నిర్ణేతలు చేరుకున్నారు. అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అతిథులకు ఆరా ఫౌండేషన్ అధ్యక్షుడు, జాతీయ యోగా శిక్షకులు కరిబండి రామకృష్ణ, యోగా బృందం ఘన స్వాగతం పలికారు. అపర్ణ ప్రసాద్, భోగవల్లి రాజా, మూర్తి, లక్ష్మీ నారాయణ, బాలగోపాల్ సుభద్ర, భాను ప్రసాద్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కామేష్

తణుకు అర్బన్: తణుకుకు చెందిన ప్రముఖ న్యాయవాది సూరంపూడి కామేష్ తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కర్నూల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.హరనాథ్ చౌదరి, న్యాయవాదులు బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం న్యాయవాదుల ఉన్నతికి కామేష్ చేసిన సేవలను బార్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

తణుకు అర్బన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దిర్సిపో రామకృష్ణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెన్మెత్స రామకృష్ణంరాజు, అన్నెపు శ్రీను, దిర్సిపో శాంతారావు, నక్కా తోవరాజు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



ముంపు నుంచి తేరుకున్న పంట పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి రాజేష్

అత్తిలి: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో సుమారుగా 2000 ఎకరాల వరి పంట నీటి ముంపుకు గురైందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం కొమ్మర, ఈడూరు గ్రామాల్లో ఆయన పర్యటించి ముంపు నుంచి తేరుకున్న పంట చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అత్తిలి మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోతే మనేదలు వేసుకోవాలని చెప్పారు. ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజిమ్ లేదా రెండు గ్రాముల కార్బెండిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకల దశలో మునిగితే సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయని, పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసి వేసి ఎకరాకు 20 కిలోల యూరియాతో పాటు 10–15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని ఏఓ రాజేష్ రైతులకు సూచించారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

అత్తిలి: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ మక్కా సూర్యారావు కోరారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల కోసం గతంలో మంజూరు కాని అర్హులైన వారి పేర్లు ప్రతిపాదనలు ఎంపీటీసీలు పంపించాలని కోరారు. అర్హులు మా త్రమే ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా రు. తిరుపతిపురం, బల్లిపాడు, వరిఘేడు గ్రామా ల్లో లోవోల్టేజ్ సమస్య నివారించాలని కోరారు. వరిగేడు పాఠశాలలో ఆట స్థలం మెరక కోసం ప్రతిపాదనలు అందజేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. పలు కారణాలతో 69 మందికి అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదని వ్యవసాయ అధికారి టీకే రాజేష్ తెలిపారు. గుమ్మంపా డు గ్రామానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలు ఆగిపోయాయని, అధికారులు చర్యలు తీసుకొని మంజూరయ్యేలా చూడాలని ఆ గ్రామ సర్పంచ్ వేగేశ్న ధన సత్యనారాయణరాజు కోరారు. మండలంలో కొత్తగా 20 మినీ గోకులం షెడ్లు మంజూరైనట్లు పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.శంకర భావన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆర్.సురేఖ, డాక్టర్ కిరణ్, తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీటీసీ ఆదారి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు నాగేశ్వరరావు, మహమ్మద్ హాబీబుద్దీన్ పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



మల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ శివారు మల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయం రూ.3,71,889 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పుష్పభాను తెలిపారు. దేవస్థానం తణుకు డివిజన్ పర్యవేక్షణాధికారి జి ప్రసాద్, గ్రూపు ఆలయ ఈవో ఎంవీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో ఐదు నెలల 10 రోజులకు గానూ బుధవారం హుండీ లెక్కించినట్లు వివరించారు.

పాలేశ్వరస్వామికి యంత్ర శిఖరం సమర్పణ

- మూడు రోజుల పాటు శత చండీయాగం
- వేద మంత్రోచ్ఛరణలతో మారుమోగిన ఇరగవరం



ఇరగవరం శ్రీపాలేశ్వరస్వామికి ఇత్తడి ఆలయ శిఖర గోపుర యంత్ర శిఖరాన్ని సమర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, లక్ష్మీకిరణ్ దంపతులు

తణుకు అర్బన్: ఇరగవరంలోని మహిషాసుర మర్దని శ్రీ ఉమాపాలేశ్వరస్వామి ఆలయ గోపుర శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు ఇత్తడితో తీర్చిదిద్దిన నూతన యంత్ర శిఖరాన్ని అందజేశారు. ఆలయ గోపుర శిఖరం ఇటీవల ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో మరమ్మతులకు గురికావడంతో నూతన యంత్ర శిఖరాన్ని రూపొందించి ఆలయ అర్చకులు, కమిటీ నాయకులకు అందజేశారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజాధికాల అనంతరం గోపుర శిఖరంలో అమర్చారు.

మూడు రోజుల పాటు యాగం

ఇరగవరంలోని పంచముఖి హనుమద్ పీఠంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు శత చండీయాగం, రుద్ర యాగం చేయించారు. పీఠాధిపతి తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించిన పూజాధికాలు భక్తులను అలరించాయి. మూడు రోజులపాటు వేద మంత్రాలతో ఇరగవరం ప్రాంతంలో భక్తులు పరవశించారు. బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తంగిరాల పాల గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాలను పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఏపీ ఆధ్వర్యంలో బుధవారం సమస్యలను పరిష్కరించాలని పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వక్తలు మాట్లాడుతూ దేశంలో 16 రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేశాయని తెలిపారు. మన రాష్ట్రంలో మెమో 57ను అమలు చేస్తామంటూనే అమలు చేయలేదని, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేస్తుందన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 25న విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో ధర్నా చౌక్ వద్ద, మహా ధర్నా నిర్వహించేందుకు సన్నాహక సూచికగా పోస్టర్ ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం, యూటీఎఫ్ నాయకులు, పలు సంఘాల బాధ్యులు హాజరై తమ మద్దతు తెలిపారు.

తీరు మారని ఇరగవరం పీహెచ్‌సీ



పీహెచ్‌సీ ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న పుస్తకాలు, రికార్డులు, మంచం

ఇరగవరం: ఎక్కడైనా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు పరిశుభ్రంగా, మందులు, ఆపరేషన్‌కు కావలసిన సామగ్రి ఉంటుంది. అయితే దానికి విరుద్ధంగా ఇరగవరం పీహెచ్‌సీలో ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్‌లో పడుకోవడానికి మంచం, బీరువాలో ఉండవలసిన పుస్తకాలు ఫైల్స్‌తో దుమ్ము, ధూళితో దర్శనమిస్తుంది. ఇరగరం మండలలోని మండల ప్రధాన కేంద్రం అయిన ఇరగవరంలో ఉన్న పీహెచ్‌సీ తీరు ఏ మాత్రం మారడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పీహెచ్‌సీ సుమారు 18 గ్రామాలకు 12 పాలెంలకు వైద్య సేవలు అందిస్తుంటుంది. దీంతో ఇక్కడ రోగుల సంఖ్య, ఇన్ పేషెంట్ల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ, ఇతరత్రా ఆపరేషన్ నిర్వహించడం కోసం ఉన్న ఆపరేషన్ థియేటర్‌ని పడుకోవడానికి, స్టోర్ రూంలా ఉపయోగిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి సిబ్బందిని వివరణ కోరగా ఇటీవల బీరువా పాడైపోవడంతో పుస్తకాలు, ఫైల్స్ అక్కడ పెట్టారు. స్టాఫ్ నర్సు మాట్లాడుతూ సిబ్బంది డ్యూటీ మారుతున్నప్పుడు మంచం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. నిజానికి ఆపరేషన్ థియేటర్‌లో ఏసీ ఉంది. దాని కోసం సిబ్బంది మంచం అందులో వేసుకుని వారు ఖాళీ దొరికినప్పుడు, రాత్రి వేళల్లో అక్కడ విశ్రాంతి తీసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై వైద్యాధికారి వి.క్రాంతిరెడ్డిని వివరణ కోరగా ఆసుపత్రిలో రూములు సరిపోకపోవడంతో ఆపరేషన్ థియేటర్‌ను వాడుకున్నారు. అక్కడ ప్రస్తుతానికి ఎటువంటి ఆపరేషన్లు చేయటం లేదన్నారు. అదే విధంగా డెలివరీలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదని తెలిపారు.

వ్యాధులకు మూలం దోమ కాటు



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డానియేలు రాజు



అత్తిలి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తాడేపల్లిగూడెం (టీఓసీ): కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఘనంగా ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

తణుకు అర్బన్: దోమ కాటు వ్యాధుల వ్యాప్తికి మూలమని అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యులు డాక్టర్ ఎస్.డానియేల్ రాజు, డాక్టర్ కె.పృథ్వీరాజ్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ల వద్ద బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఎన్సెఫలైటిస్, ఫైలేరియా వంటి వ్యాధులు రావడానికి అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే దోమల నివారణ సాధ్యమన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1897లో బ్రిటిష్ శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ దోమల వలన మలేరియా మనుషులకు వస్తుందనే విషయాన్ని కనుగొన్నారని, అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 20వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫైలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాస్, కె.రామకృష్ణ, బి.శ్రీనివాస్, పి.కిశోర్, వార్డు హెల్త్ సెక్రెటరీలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలతోనే ఆరోగ్యవంతమైన సమాజం

అత్తిలి: దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఆర్.సురేఖ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పాటించాలన్నారు. గృహాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలంలో ఖర్చు రహిత డ్రైడేపాటించడం ద్వారా మాత్రమే దోమ పుట్టుకకు చెక్ పెట్టొచ్చన్నారు. ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ ప్రజలు డ్రైడే పాటించేలా ప్రేరణ కలిగించాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జి.ప్రమీలాదేవి, హెచ్‌ఎస్ జి.వెంకటరాజు, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ గనిరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పలువురు హెల్త్ అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లలో అవగాహన సదస్సులు నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు కడకట్ల, వీకర్స్‌కాలనీ, ఎన్‌టీఆర్ జంక్షన్, యాగర్లపల్లి సెంటర్లు వైద్యులు అనీషా, శ్రావ్య, వన్య ప్రియ, తనూజ ఆధ్వర్యంలో ర్యాలీలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీఎంఓ రమేష్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.